సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 5 । అక్టోబర్ । 2024



రైతుల ఆక్రందన
జూన్, జూలైలో అధిక వర్షాలకు పంట దెబ్బ తిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ సాయం అందించలేదు.
6లో ▸



పోరుకు సిద్ధం
సంక్రాంతి కోడి పందాలకు పుంజులు సిద్ధమవుతున్నాయి. పూర్తిస్థాయిలో శిక్షణతో సన్నద్ధమవుతున్నాయి.
6లో ▸



అడ్డగోలు బదిలీలు
ఏపీసీపీడీసీఎల్‌లో పోస్టులు లేకుండానే లైన్‌మెన్లను బదిలీ చేశారు. ఇది నూజివీడు డివిజన్‌లో హాట్ టాపిక్‌గా మారింది.
6లో ▸

కల్తీ కుట్రలకు చెంపపెట్టు

తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో కూటమి ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోమారు ఎదురుదెబ్బ తగిలింది. కల్తీ వివాదంపై దాఖలైన పిటిషన్లపై విచారణ నిర్వహించిన ధర్మాసనం చంద్రబాబు సర్కారు ఏర్పాటుచేసిన సిట్‌ను రద్దు చేసింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశించింది. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా సీఎం చంద్రబాబు చేసిన కుట్రలకు చెంపపెట్టులా తీర్పు వచ్చిందంటూ నాయకులు, ప్రజలు అంటున్నారు.

బాబుకు మొట్టికాయలు
- శ్రీవారి లడ్డూ కల్తీపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశం
- సీఎం చంద్రబాబుకు మరోసారి ఎదురుదెబ్బ
- నైతిక విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ
- ఈ తీర్పు కూటమి నేతలకు చెంపపెట్టు అంటున్న ప్రజలు



సాక్షి, భీమవరం : తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా, ఎలాంటి ఆధారాలు లేకుండానే సీఎం చంద్రబాబు శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఆధారాలు లేకుండా ఎలా ఆరోపణలు చేస్తారంటూ రెండు రోజుల క్రితం చంద్రబాబు అండ్ కోకు అక్షింతలు వేసిన అత్యున్నత ధర్మాసనం శుక్రవారం మరోమారు మొట్టికాయలు వేసింది. సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని హితవు పలికింది. భగవంతుడిని రాజకీయాల్లోకి లాగొద్దని, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు బాధ్యతగా వ్యవహరించాలని చురకలంటించింది. తిరస్కరించిన నెయ్యిని లడ్డూలో వాడలేదని ఈఓనే చెబుతున్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. కల్తీ నెయ్యి వాడినట్లు రుజువులు ఉన్నాయా అని ప్రశ్నించింది.

తీర్పును స్వాగతిస్తూ..
సుప్రీంకోర్టు తీర్పును వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు స్వాగతిస్తున్నారు. తమ నైతిక విజయంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడుతుండగా, భక్తుల మనోభావాలను గాయపరుస్తూ, గత ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు వంటిదని వివిధ వర్గాల ప్రజలు విమర్శిస్తున్నారు. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో వాస్తవాలు బయటకు వస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

సుప్రీం తీర్పు శుభపరిణామం



పవిత్రమైన తిరుమల వేంకటేశ్వరుని లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు ఆహ్వానించదగ్గ పరిణామం. దేవుడిని రాజకీయాల కోసం వాడుకోవడం దారుణం. దీనిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్‌పై ఎవరికీ నమ్మకం లేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సీబీఐ, ఏపీ పోలీసు, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అధికారులతో కూడిన ప్రత్యేక విచారణను ఏర్పాటుచేయడం అభినందించదగ్గ పరిణామం.
– కామన నాగేశ్వరరావు, న్యాయవాది, భీమవరం

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది



తిరుపతి లడ్డూ విషయంలో అపోహలు సృష్టించి కోట్లాది మంది మనోభావాలను ఈ ప్రభుత్వం దెబ్బతీసింది. కల్తీ జరిగిందా లేదా అనే విషయాన్ని తెలుసుకోకుండా కేవలం రాజకీయ స్వలాభం కోసం భక్తుల మనోభావాలతో ఆటలాడుకుంది. కల్తీ జరిగి ఉంటే నిందితులను తప్పనిసరిగా శిక్షించాలి. హిందువుల మనోభావాలను కాపాడుతూ, ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా సుప్రీంకోర్టు వ్యవహరించింది.
– ఈరంకి కాశీవిశ్వనాథం, వేద పండితుడు, పాలకొల్లు

కూటమి నేతలకు మింగుడు పడటం లేదు



తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంలో దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు కూటమి నేతలకు మింగుడు పడటం లేదు. వీటిని కూడా తప్పుపట్టే పరిస్థితికి కూటమి నేతలు దిగజారారు. తమ స్వార్థ రాజకీయాలకు శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అస్త్రంగా వాడడాన్ని భక్తులు తప్పుపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిట్‌ను రద్దుచేసి సీబీఐతో పాటు ఐదుగురు ప్రత్యేక అధికారుల బృందాన్ని న్యాయస్థానం ఏర్పాటుచేయడం శుభపరిణామం.
– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

చంద్రబాబు, పవన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



పవిత్రమైన తిరుమల లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హిందువుల మనోభావాలను నిలబెట్టింది. సుప్రీంకోర్టు సెంటిమెంట్‌ను పదిలంగా ఉంచింది. ప్రజలు ఏదైతే ఆశించారో అత్యున్నత ధర్మాసనం న్యాయమూర్తుల నోటి వెంట అదే వచ్చింది. ఈ తీర్పు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు చెంపపెట్టు వంటిది. ఇప్పటికైనా వారు ప్రాయశ్చిత్తం పొంది ప్రజలకు క్షమాపణ చెప్పాలి. అలాగే మంచి బుద్ధిని ప్రసాదించమని లెంపలు వేసుకుని శ్రీవారిని క్షమాపణలు వేడుకోవాలి.
– కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి

చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి



తిరుమల లడ్డూ రాద్ధాంతంపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని మత రాజకీయాలు మానాలి. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారానికి ఏకంగా కలియుగ ప్రత్యక్ష దైవాన్ని అడ్డుపెట్టుకోవడానికి కూడా చంద్రబాబు వెనకాడలేదు. జరగనిది జరిగినట్టుగా తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం స్థానంలో ఉండి చంద్రబాబు ప్రచారం చేశారు. నిజాలన్నీ త్వరలో బయటకు వస్తాయి. తగిన శాస్తి తప్పదు.
– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

రఘురామ కృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి



భీమవరంలో దళిత సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదానికి సంబంధించి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బహుజన జేఏసీ కన్వీనర్ తాళ్లూరి మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పండు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామ క్షమాపణ చెప్పకుంటే అంచెలంచెలుగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, చలో రాజధానికి పిలుపునిచ్చి సత్తాచాటుతామన్నారు. నాయకులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, గుంపుల సత్యకృష్ణ, గంటా సుందరకుమార్, బడుగు అశోక్‌బాబు, బిరుదుగడ్డ రమేష్, మీసాల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి గ్రామసభలు



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే, ధాన్యం కొనుగోళ్లు, రేషన్ షాపులపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రీసర్వే జరిగిన 174 గ్రామాల్లో ఈనెల 15 నుంచి 30 వరకు గ్రామసభలు నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి శనివారం నుంచి 9వ తేదీ వరకు సిబ్బందికి మూడో విడత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రేషన్ షాపుల ఏర్పాటుపై సూచనలిచ్చారు. కొత్తగా షాపులు ఏర్పాటుకు ఈనెల 12లోపు ప్రతిపాదనలు పంపాలన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డీఎస్‌ఓ ఎన్.సరోజ, ఏఎస్‌ఓ ఎం.శివశంకర్ పాల్గొన్నారు.

శ్రీవారి అంతరాలయం.. స్వర్ణమయం



అంతరాలయాన్ని సందర్శిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు, నివృతరావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వరస్వామి అంతరాలయం స్వర్ణ కాంతులీనుతోంది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు రూ. 1,64,19,411తో స్వామి వారి అంతరాలయానికి బంగారపు తాపడాన్ని చేయించారు. వీటి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన కుమారుడు అనువంశిక ధర్మకర్త నివృతరావు, దాతలు, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం అంతరాలయాన్ని సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు దాత వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లకు శ్రీవారి శేష వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ చైర్మన్ సుధాకరరావు వారికి స్వామివారి మెమెంటోలు, ప్రసాదాలను అందజేశారు. దాతలు బంగారు తాపడానికి సంబంధించిన పత్రాలను చైర్మన్‌కు అందించారు.

టెట్‌కు 322 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పరీక్షలు శుక్రవారం ఏలూరులోని రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 185 మందికి 159 మంది, మధ్యాహ్నం 185 మందికి 163 మంది హాజరయ్యారని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

నడక పోటీల్లో ప్రతిభ

ద్వారకాతిరుమల: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా గుంటూరులో ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. 45 ప్లస్ మహిళల నడక పోటీలో పంగిడిగూడెం హైస్కూల్ ఉపాధ్యాయురాలు పైడి రాజేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచారు.

టమోత మోగుతోంది

సెంచరీ దిశగా పరుగులు



తాడేపల్లిగూడెం: టమాటా ధరల మోత మోగించనుంది. తమిళనాడు, కర్ణాటకలో టమాటాల దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అక్కడి వ్యాపారులు రాష్ట్రంలోని మదనపల్లి మార్కెట్‌పై పడ్డారు. రెండు రోజుల క్రితం కిలో రూ.40 నుంచి రూ.60 ఉండగా శుక్రవారం ఒక్కసారిగా ధర పెరిగింది. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మదనపల్లి నుంచి టమాటా వస్తుంది. మదనపల్లి మార్కెట్‌లో 25 కిలోల ట్రే హోల్‌సేల్‌గా రూ.2,200 పలికింది. ఈ సరుకు రవాణా ఖర్చులతో కలిపి ఇక్కడ కిలో రూ.100 దాటనుంది. శనివారం టమాటా ధర మరింత పెరగనుంది. ప్రస్తుతం ఇక్కడి మార్కెట్‌లో 25 కిలోల ట్రే రూ.1,900కు విక్రయించారు. ఇదిలా ఉండగా వారం రోజులుగా స్థిరంగా ఉన్న బెండ, బీరకాయల ధరలు పెరిగాయి. పది కిలోలు రూ. 300 ఉన్న బీరకాయలు రూ.500, రూ. 200 ఉన్న బెండకాయల ధరలు రూ.400కు చేరాయి. అలాగే మహారాష్ట్ర నుంచి గూడెం మార్కెట్‌లకు వచ్చే పాత ఉల్లిపాయలు ధరలు పైపైనే ఉన్నాయి. హోల్‌సేల్‌గా పది కిలోలు రూ.550 పలకగా విడిగా కిలో రూ.60కు విక్రయిస్తున్నారు. కర్నూలు ఉల్లి మార్కెట్‌కు వస్తోంది. ఆ ప్రాంతంలో వానలు తక్కువగా ఉండటంతో పెద్ద రకం ఉల్లిపాయలు రావడం లేదు. గోల్టా, గోల్టీ సైజులు మాత్రమే వస్తున్నాయి. ఇవి పది కిలోలు రూ.350 నుంచి రూ.400 వరకు ఉన్నాయి. విడిగా కిలో రూ.45కు అమ్ముతున్నారు.

దళారులకే ఇసుక

బ్రోకర్లకు భోజ్యం.. సామాన్యులకు దూరంలా ఉంది ఇసుక పరిస్థితి. ఓ పక్క జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేకపోవడం.. మరోపక్క ఇసుక కొరత నిర్మాణ రంగాన్ని కుదేలు చేస్తోంది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇదే అదనుగా దళారులు దోచుకుంటున్నారు. జిల్లాకు కేటాయించిన స్టాక్ పాయింట్లలో దాదాపు నిల్వలు నిండుకోవడంతో బ్రోకర్ల హవా నడుస్తోంది. దీంతో రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకని పరిస్థితి నెలకొంది.

బ్లాక్ మార్కెట్
- ఒక్క స్టాక్ పాయింట్‌లోనే లభ్యత
- ఐదు రోజుల క్రితం తెరుచుకున్న సైట్.. తర్వాత క్లోజ్
- కమీషన్‌దారులకు ముందే తెలుస్తున్న సమాచారం
- వినియోగదారులకు నేరుగా దొరకని వైనం
- భీమవరానికి ఐదు యూనిట్లు రూ.35 వేలు
- భవన నిర్మాణ రంగం కుదేలు
- లక్షకు మందికి పైగా కార్మికులకు ఉపాధి కరువు



సాక్షి, భీమవరం: జిల్లాకు సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల, తీపర్రు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెంలో గత ప్రభుత్వం స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి భవిష్యత్ అవసరాలకు ఇసుక నిల్వ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు ఇసుక అక్రమ తరలింపునకు తెరలేపారు. నేతల ఒత్తిళ్లతో అధికారులు పాత స్టాకు రికార్డుల జోలికి వెళ్లకుండా ఉన్న స్టాకులే లెక్కలు గట్టి ప్రకటించారు. జూలైలో అమ్మకాలు మొదలు పెట్టే నాటికి జిల్లాకు కేటాయించిన పందలపర్రు స్టాక్ పాయింట్ వద్ద 52,082 టన్నులు, పెండ్యాలలో 1,46,249, ఉసులుమర్రులో 33,065, రావులపాడు-1లో 34,171, రావులపాడు-2లో 82,950, కొత్తపేట కేంద్రంలో 25,897 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే పెండ్యాలలో అరకొర నిల్వలు మినహా నెలరోజుల క్రితమే మిగిలిన స్టాకు పాయింట్ల వద్ద నిల్వలు అయిపోయాయి.

బ్రోకర్లదే హవా : పేరుకు ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం ప్రకటించినా మొదటి నుంచీ స్టాక్ పాయింట్లు వద్ద కూటమి నేతలు, బ్రోకర్ల హవానే నడుస్తోంది. పెండ్యాల స్టాక్ పాయింట్‌కు సంబంధించి నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అయ్యి కొద్దిసేపటికే క్లోజ్ అయ్యింది. ముందుగానే సమాచారం తెలిసిన దళారులు ఇసుక బుకింగ్ చేసుకున్నారు. సామాన్యులకు సమాచారం లేకపోవడంతో ఇసుక దొరకని పరిస్థితి. దీంతో బ్రోకర్లు నిర్ణయించిన ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మునుపెన్నడూ లేనివిధంగా భీమవరానికి ఐదు యూనిట్ల లారీ రూ.32 వేల నుంచి రూ.35 వేల వరకు ధర పలుకుతోంది. జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు తదితర ప్రాంతాలకు ధరలు భారీగానే ఉంటున్నాయి.

ఉపాధి కరువు : ఇసుక కొరత నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధిక ధర వెచ్చించి ఇసుక కొనుగోలు చేయలేక సామాన్య, మధ్యతరగతి వర్గాలు నిర్మాణాలను నిలిపివేస్తున్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువయ్యింది. జిల్లాలో కార్మిక శాఖలో నమోదైన భవన నిర్మాణ కార్మికులు 42,759 మంది ఉండగా నమోదు కాని కార్మికులు రెట్టింపు స్థాయిలో ఉన్నారు. ఇసుక దొరక్క కొద్దినెలలుగా పూర్తిస్థాయిలో పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో టిప్పర్ లారీలు సుమారు 3 వేల వరకు ఉన్నాయి. ఒక్కో లారీపై ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్లు, యజమాని ఆధారపడి జీవిస్తున్నారు. లోడింగ్ లేక వారికీ పనులు ఉండటం లేదు. కొందరు పనుల కోసం తెలంగాణ, కర్ణాటక, ఒడిసా రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. ఇసుక సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ ఇప్పటికే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నాలు నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

ఉపాధి పోయింది



ఇసుక లేక భవన నిర్మాణాలు ఆగిపోవడంతో ఎలక్ట్రికల్ వర్క్ చేసే వారికి ఉపాధి పోయింది. ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించింది. అయినా ఇసుక అందుబాటులో లేదు. మూడు నెలలుగా ఇళ్ల నిర్మాణాలు లేవు. దీంతో పనులు లేక ఇబ్బంది పడుతున్నాం.
– మారోజు గణేష్, ఎలక్ట్రీషియన్, భీమవరం

నిర్మాణ దశలో నిలిపేశా..



ఇసుక కొరతతో నా ఇంటి నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఇసుక కోసం మున్సిపల్ ఆఫీసు, సచివాలయం చుట్టూ చాలాసార్లు తిరిగాను. ఇసుక బుకింగ్ అవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు.
– యాతం శ్రీనివాసరావు, 10వ వార్డు, నరసాపురం

ఇసుక దొరకడం లేదు



ఇళ్ల వద్ద చిన్నపాటి పనులకూ ఇసుక దొరకడం లేదు. నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇసుక అధిక ధర పలుకుతోంది. రెండు టన్నుల టిప్పర్ లారీ ఇసుక రూ.15 వేల నుంచి రూ.16 వేలు పలుకుతోంది. ఈ ధరలతో సామాన్యులు ఇళ్లు కట్టుకోలేరు.
– కమ్మిల గోపీకృష్ణ, అజ్జమూరు, ఆకివీడు మండలం

కార్మికులను ఆదుకోవాలి



భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. మూడు నెలలుగా పనిలేక ఇబ్బంది పడుతున్నాం. చాలా మంది పనుల కోసం తెలంగాణ, ఒడిస్సా తదితర పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. కార్మికులకు భృతి అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలి.
– తాతారావు, భవన నిర్మాణ కార్మికుడు, పెనుగొండ

లారీ కిరాయిలు లేవు



బాడీ లారీలకు ఇసుక వేయకపోవడంతో యజమానులు కిరాయిలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇసుక కిరాయికి వెళితే రెండు, మూడు రోజులు ఇతర కిరాయిల్ని పోగొట్టుకోవాల్సి వస్తోంది. ఇసుక కొరతతో కిరాయిలు ఉండటం లేదు.
– కుర్నెళ్ల పోలు, లారీ డ్రైవర్, దుంపగపడ, ఆకివీడు మండలం

తాపీ పనులు లేవు



తాపీ పనులు లేకపోవడంతో కుటుంబ జీవనం కష్టసాధ్యంగా మారింది. ఒకరిద్దరికి తప్ప మిగతా వారికి పనులు ఉండడం లేదు. దీంతో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలి.
– ఈ.రమేష్, భవన నిర్మాణ కార్మికుడు, ఆచంట

రోడ్డెక్కిన నిర్మాణ కార్మికులు



తణుకు టౌన్: వేల్పూరులో ధర్నా చేస్తున్న సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

పెనుగొండ/తణుకు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినా ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీ ఇప్పటికీ అమలు చేయడం లేదని, ఇసుక బ్లాక్ మార్కెటింగ్ దందాగా జరుగుతోందంటూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘాలు ధ్వజమెత్తా యి. జిల్లాలో వేల్పూరు, సిద్ధాంతం గ్రామాల్లో శుక్రవారం ఆయా సంఘ నాయకులు ధర్నాలు చేశారు. సిద్ధాంతంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 100 రోజులు దాటినా.. ఇసుకను అందుబాటులోకి తేలేకపోవడం దారుణమన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి కోల్పోకుండా వెంటనే ఇసుకను అందబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. వేల్పూరు గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, సీపీఎం మండల కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వేల్పూరు గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘాల అధ్యక్షులు అంబటి రామకృష్ణ, తిరునాదం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవస్థానం నిధుల దుర్వినియోగంపై నిలదీత



బల్లిపాడులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అత్తిలి: బల్లిపాడు మదనగోపాలస్వామి కల్యాణోత్సవ భక్తులు సమర్పించిన విరాళాలకు రశీదులు ఇవ్వకపోవడం, దేవస్థానం భూములకు సంబంధించి కౌలు డబ్బులు జమ చేయకపోవడంపై గ్రామస్తులు ఆలయ ఈఓ హరిగోపినాథ్‌ను నిలదీశారు. బదిలీపై వెలుతున్న ఆయన్ను శుక్రవారం నిధుల దుర్వినియోగంపై ఆరా తీశారు. ఆలయం ముందు నిరసన తెలిపారు. గత మార్చిలో జరిగిన కల్యాణోత్సవాల సమయంలో అన్నదానం నిమిత్తం దాతలు అందించిన విరాళాలకు రశీదులు ఇవ్వకపోవడం, పీఆర్సీ అమలు చేయడానికి ఆలయ అర్చకుల నుంచి డబ్బులు వసూలు చేయడం, ఉత్సవాల్లో సాంస్కృతిక వినోద కార్యక్రమాలు నిర్వహించకుండానే నిధులు డ్రా చేయడం, కిరాణా, పూల దుకాణాలకు రూ.లక్షల్లో బాకీ ఉండటం వంటి విషయాలపై ఈఓను నిలదీశారు. దీనిపై ఈఓ హరిగోపినాథ్ పొంతనలేని సమాధానాలు ఇవ్వడం గ్రామస్తులను గందరగోళానికి దారితీసింది. దేవస్థానం భూములకి సంబంధించి చెల్లించిన కౌలు శిస్తు సొమ్ము రూ.1.06 లక్షలను అప్పటికప్పుడు ఈఓ జమ చేశారు. ఉన్నతాధికారులు పూర్తివిచారణ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మిల్క్ డెయిరీలో చోరీ



సీసీ కెమెరాలో నమోదైన చోరీ దృశ్యం

తణుకు : తణుకు పట్టణ పరిధిలోని ఒక మిల్క్ డెయిరీలోకి గురువారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదును అపహరించుకు పోయారు. ఆలమూరి వారి వీధిలో శ్రీనివాస మిల్క్ డెయిరీలో ముగ్గురు వ్యక్తులు షట్టర్ తాళాలు పగలుగొట్టి లోపల ఉన్న రూ.1 లక్ష అపహరించుకుపోయారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. యజమాని కోరపాటి రాజ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మద్యం సేవించిన వ్యక్తికి జరిమానా

భీమవరం: స్థానిక టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి చినఅమిరంలో మద్యం సేవించి మోటారుసైకిల్ నడుపుతున్న పి.శ్రీనుకు కోర్టు రూ.10 వేలు జరిమానా విధించినట్టు టుటౌన్ సీఐ జి కాళీచరణ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 2వ తేది రాత్రి తనిఖీ చేస్తుండగా శ్రీను పట్టుబడినట్టు పేర్కొన్నారు. శ్రీనును భీమవరం స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌లో హాజరు పర్చగా జరిమానా విధించారన్నారు. అలాగే శుక్రవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారని తెలిపారు.

6 నుంచి ట్రిపుల్ ఐటీలకు దసరా సెలవులు


నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఈ నెల 6 నుంచి 13 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14న ట్రిపుల్ ఐటీలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

డబ్లింగ్ కరెన్సీ ముఠా సభ్యుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: డబ్లింగ్ కరెన్సీ ముఠా సభ్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలోని జేపీ సెంటర్‌లో చైనీస్ రెస్టారెంటు నడుపుతున్న భద్రా జ్యోతికుమార్ అనే వ్యక్తికి వాటర్ క్యాన్ల వ్యాపారం చేసే మద్దిపాటి కళ్యాణ్ అనే వ్యక్తి ముందుగా రెండు రూ.500 నోట్లిచ్చి మార్చమన్నాడు. అవి మారడంతో జ్యోతికుమార్ వద్ద నుంచి రూ.45 వేలు తీసుకుని, రూ.90 వేలు కరెన్సీని కళ్యాణ్ ఇచ్చాడు. అనంతరం రూ.6 లక్షలు తీసుకుని రూ.12 లక్షలు ఇస్తానని తెల్లకాగితాలున్న బ్యాగు ఇవ్వడంతో కళ్యాణ్‌ను ప్రశ్నించగా, జ్యోతికుమార్‌ను చంపేస్తానని, రెస్టారెంట్‌ను తగులబెడతానని బెదిరించాడు. ఈ నేరంపై కళ్యాణ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఆకివీడులోని నాటుకోళ్ల కేంద్రంలో ఉన్న పందెం పుంజులు



నాటుకోళ్ల కేంద్రం వద్ద పందెం పుంజులు

పోరుకు సిద్ధమవుతున్న పుంజులు

- సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే శిక్షణ
- ఉదయాన్నే వాకింగ్, స్విమ్మింగ్
- ఒక్కో పుంజుపై రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం
- మటన్, గుడ్లు, బాదం, ఎండు ఖర్జూరం, వెల్లుల్లితో ప్రత్యేక మేత మెనూ
- జిల్లాలో 200లకు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు
- సంక్రాంతి సీజన్‌కు రూ.20 కోట్లకుపైగా వ్యాపారం



కోడిడేగ

సాక్షి, భీమవరం : సంక్రాంతి పండుగల పేరు చెబితే గుర్తుకు వచ్చేవి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే కోడి పందాలే. మూడు రోజులు కోడి పందాలు ద్వారా కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. కొద్ది నిముషాల పాటు జరిగే పందెం బరిలో ప్రత్యర్థి పుంజును మట్టికరిపించేందుకు సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే పందెం పుంజులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేకంగా బరులు

భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా బరులు, గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి నిర్వహించే కోడి పందాలు ఖ్యాతిగాంచాయి. వీటిని చూసేందుకు ఎందరో సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు. పందాలకు ఉన్న క్రేజ్‌కు తగ్గట్టుగానే పుంజుల పెంపకంలో పందెంరాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కొందరు తమ ఇళ్లు, చెరువులు, పొలాలు వద్ద పుంజులను పెంచితే ఎక్కువ మంది నాటుకోళ్ల కేంద్రాల్లో పుంజులను ఎంచుకుని వాటిని పందాలకు సిద్ధం చేసే పనిని పెంపకందారులకే అప్పగిస్తారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు విదేశాల నుంచి సంక్రాంతికి జిల్లాకు వచ్చే ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో పుంజులను ఎంపిక చేసుకుని పెంపకం దారులకు ముందే అడ్వాన్స్‌లు చెల్లిస్తుంటారు. పందెం పుంజులకు ఉన్న డిమాండ్‌తో జిల్లాలోని భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో 200కు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు ఉన్నాయి. కొందరు స్థలాలను లీజుకు తీసుకుని వీటి పెంపకం సాగిస్తుంటారు. సామర్థ్యాన్ని బట్టి ఒక్కోచోట 100 నుంచి 250 వరకు వివిధ రకాల జాతుల పుంజులు, కోళ్లను పెంచుతుంటారు.

దినచర్య ఇలా..


మకాంలోని ఐరెన్ కేజ్‌లలో ఉండే పందెం కోళ్లను బయటకు తీసి ఆరుబయట కట్టడం మొదలుపెడతారు. అప్పటి నుంచే వీటి శిక్షణ మొదలవుతుంది. ప్రస్తుతం చాలా మకాంల వద్ద పుంజులను బయట కట్టడం ప్రారంభించారు. రోజు ఉదయాన్నే వేడి నీటిని పట్టిస్తారు. బరిలో చురుగ్గా కదిలేందుకు వీలుగా కాళ్లల్లో చురుకుదనానికి నెలరోజులు పాటు రోజు విడిచి రోజు సమీపంలోని చెరువులు, నీళ్ల తొట్టెల్లో ఈత కొట్టిస్తారు. తర్వాత వీ ఆకారంలో నెట్‌లు కట్టి పుంజు అందులోనే తిరిగే విధంగా బేటా (నిర్ణీత పద్ధతిలో వాకింగ్) కొట్టిస్తారు. మరికొందరు ఖాళీ జాగాలో వాటి వెనుకే ఉండి తరుముతూ వాకింగ్ చేయిస్తారు. మేత పెట్టి 11 గంటల సమయం వరకు ఎండలో కట్టేసిన తర్వాత మకాంలోకి మార్చేస్తారు. పండుగలు దగ్గర పడుతున్న కొద్దీ పుంజు శరీరం గట్టిపడేందుకు, నొప్పులేమైనా ఉంటే తగ్గేందుకు ప్రత్యేక ట్రైనర్లతో నీళ్లపోతలు, శాఖలు చేయిస్తారు.



పుంజును నీళ్ల తొట్టెలో ఉంచి ఈత కొట్టిస్తున్న దృశ్యం

శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ

కాకి, నెమలి, అబ్రాస్, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతులకు చెందిన ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వయసు కలిగిన పుంజులను పందాలకు వినియోగిస్తుంటారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వీటి పాత ఈకలు ఊడిపోయి కొత్త ఈకలు వస్తుంటాయి. తర్వాతి నుంచి వీటికి శరీర పటుత్వం, శక్తిని పెంచేందుకు శిక్షణ ప్రారంభిస్తారు. అందుకోసం ఎవరికి వారు ఎన్నో సంప్రదాయ, ఆధునిక పద్ధతులు పాటిస్తారు. పుంజులకిచ్చే ఆహారం, మందులు నుంచి శిక్షణ వరకు ప్రతి విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. తాము ఎలా పెంచుతుందీ ఇతరులకు తెలీకుండా గోప్యత పాటిస్తారు.




కాకిడేగ



అబ్రాస్

5 వేలకు పైగా కోళ్లు

కోడికి అందించే ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పందెం పుంజును సిద్ధం చేసేందుకు మూడు నెలల్లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఈ విధంగా పెంచిన పుంజులను వాటి రంగు, ఎత్తు, పోరాట పటిమను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో అమ్ముతుంటారు. వీటిపై భారీస్థాయిలో పందాలు జరుగుతుంటాయి. పండుగల కోసం ఐదు వేలకు పైగా పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా.



కేతువ

మేత దర్జానే వేరు

కోపం వచ్చినప్పుడు నిన్ను పందెం పుంజును మేపినట్టు మేపానని దెప్పడం గోదావరి జిల్లాల్లో నానుడి. దీనినిబట్టి పందెం కోళ్లను ఇక్కడ ఏ విధమైన మేతను అందిస్తారో అర్థం చేసుకోవచ్చు. శిక్షణలో శక్తి, సామర్థ్యం పెంచేందుకు, శరీరంలో కొవ్వు చేరకుండా తేలిగ్గా ఎగురుతూ ప్రత్యర్థిపై విరుచుకుపడేందుకు పందెం పుంజులకు ఈ మూడు నెలలు ప్రత్యేక మేతను అందిస్తారు. కోడి సైజును బట్టి ఉదయం పూట 20 నుంచి 40 గ్రాముల వరకు ఉడకబెట్టిన మటన్, మూడు నుంచి ఐదు వరకు బాదం, రెండు వెల్లుల్లి, ఒక ఎండు ఖర్జూరం, కోడి గుడ్డు ముక్కలు చేసి పెడతారు. తిరిగి సాయంత్రం ఎప్పటిమాదిరి సోళ్లు, గంటులు, మెరికలు మొదలైన వాటిని పెడతారు. పండుగలకు మూడు నెలలు మాత్రమే సమయం ఉండటంతో ఇప్పటికే భీమవరం పరిసర ప్రాంతాల్లో పందెంకోళ్ల పెంపకం జోరుగా సాగుతోంది.



తెల్లనెమలి

ఇన్‌కమ్ ట్యాక్స్ దాడుల భయం

భీమవరం: మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేవారిలో ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు భయం పట్టుకుంది. ప్రస్తుతం జిల్లాలో 175 మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ షాపుల ఏర్పాటులో కూడా పాత విధానాన్నే అవలంభించి సిండికేట్స్‌గా వ్యాపారం చేయాలని గతంలో సిండికేట్స్‌గా ఏర్పడిన నాయకులు చూస్తున్నారు. అయితే కూటమి నాయకులు షాపుల్లో వాటాల వేటలో తలమునకలై ఉండగా కొందరు ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన షాపుల్లో 60 శాతం పైగా వాటా తమకే ఇవ్వాలనే ఒత్తిళ్లు తెస్తున్నారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలతో పాటు రెండేళ్లపాటు షాపులకు లైసెన్స్ ఫీజు రూ.55 లక్షల నుంచి రూ.70 లక్షలకు పైబడి చెల్లించాల్సి ఉంటుంది. పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టే వారిపై ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు తప్పక కన్నేసి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఒక పక్క ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల వాటాలు, మరో పక్క ఇన్‌కమ్ ట్యాక్స్ భయంతోనే మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోడానికి వెనుకంజవేస్తున్నట్టు చెబుతున్నారు. జిల్లాలో 175 షాపులకు శుక్రవారం నాటికి 8 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ షాపుల ఏర్పాటుకు సంబంధించి భీమవరం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ కె.బలరామరాజు దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తు చేసే విధానం, దరఖాస్తు ఫీజు, లైసెన్స్ ఫీజు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న సీఐ బలరామరాజు

పరిహారం అందక అన్నదాతల ఆక్రందన

జూన్, జూలై నెలల్లో నష్టపోయిన రైతులకు అందని సాయం

భీమవరం: అన్నదాతలను ఆదుకుంటామంటూ కల్లబొల్లిమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వరదలు, భారీవర్షాలు కారణంగా దెబ్బతిన్న రైతన్నల ఆక్రనందలు పట్టించుకోవడం లేదు. సార్వా సీజన్‌కు పెట్టుబడి సాయం, జూన్, జూలై నెలల్లో అధిక వర్షాలకు వరి పైరు దెబ్బతిన్న రైతులకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సార్వా సీజన్‌లో దాదాపు 2.9 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సుంది. జూన్, జూలై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంట భూములు నీట మునిగి ముందుగా వేసిన నాట్లు, నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్పటికే నారుమళ్లు వేయడానికి, దుక్కుదున్నడానికి దాదాపు రూ.9 వేలు, నాట్లుకు మరో రూ.5 వేలు వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, గణపవరం, అత్తిలి తదితర మండలాల్లో ముందుగా వేసిన నాట్లు, నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతాల్లో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పర్యటించి రైతులను ఆదుకుంటామంటూ హామీ ఇచ్చారు. అప్పట్లో సుమారు 13,242 ఎకరాల్లో నాట్లు దెబ్బతినగా, సుమారు 9,918 మంది రైతులు నష్టపోయినట్టు వ్యవసాయశాఖ అంచనావేసింది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వరి విత్తనాలు మినహా ఎటువంటి సాయం అందలేదు. వ్యవసాయమే జీవనాధారమైన రైతులు తిరిగి అప్పులు చేసి ఇతర ప్రాంతాల్లో వరినారు కొనుగోలు చేసి రెండోసారి నాట్లు వేశారు.



అత్తిలి మండలం మంచిలిలో వర్షాలకు దెబ్బతిన్న వరినాట్లు (ఫైల్)

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో బాధితులకే పరిహారం

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరదలు, వర్షాల కారణంగా జిల్లాలోని 16 మండలాల్లో సుమారు 8,900 ఎకరాల్లో పంట దెబ్బతినగా దాదాపు 6,312 మంది రైతులు నష్టపోయినట్టు వ్యవసాయశాఖ లెక్కలు కట్టింది. వరదలు, వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రైతులతో పాటు జిల్లాలోని రైతులకు ఎకరాకు రూ.10 వేలు పంట నష్టపరిహారం రైతుల బ్యాంకు ఖాతాల్లో వేశారు. ముందుగా నష్టపోయిన రైతులు తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పంట నష్టం, రైతులకు అందిన పరిహార వివరాలు

మండలం	రైతులు	విస్తీర్ణం ఎకరాల్లో	పరిహారం రూ.లక్షల్లో..
ఆచంట	77	98	9.84
ఆకివీడు	1221	2,107	210.82
అత్తిలి	572	603	60,31
భీమవరం	126	216	21.64
కాళ్ల	551	812	81.19
గణపవరం	327	542	54.22
మొగల్తూరు	112	109	10.91
నరసాపురం	1,090	1,297	129.71
పాలకోడేరు	239	325	32.57
పాలకొల్లు	382	417	41.76
పెంటపాడు	39	57	5.81
పోడూరు	74	185	9.36
తాడేపల్లిగూడెం	5	7	0.74
ఉండి	412	621	62.13
వీరవాసరం	510	724	72.40
యలమంచిలి	575	871	87.13

తణుకులో న్యాయవాదుల నిరసన




బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

తణుకు: అడ్వకేట్స్ అమెండ్‌మెంట్ బిల్లు 42 నిలుపుదల కోరుతూ శుక్రవారం న్యాయవాదులు తణుకు బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో కేసు చేయడంలో నష్టం జరిగితే సంబంధిత క్లయింట్ న్యాయవాదిపై బార్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల న్యాయవాదిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. న్యాయవాద వృత్తిలో అనేక ఒడిదుడుకులు నేపథ్యంలో అనారోగ్యాలకు లోనవుతున్న క్రమంలో ప్రతి న్యాయవాదికీ ప్రభుత్వమే ఆరోగ్య బీమా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, అనుకుల రమేష్, వెన్నపు సుధాకర్, ఎస్ లాజర్, బీబీ విక్టర్‌బాబు, ఎస్‌కే బాజీ, ఆర్.శ్రీనివాసులు, చింతపల్లి నాగేశ్వరరావు, రాపాక ప్రభాకర్, ఆర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

తాడేపల్లిగూడెం : లక్ష్యసాధన కోసం విద్యార్థులు నిరంతరం శ్రమించాలని తిరుపతి ఐఐటీ డీన్ అకడమిక్ అఫైర్స్ రామకృష్ణ గొర్తి సూచించారు. ఏపీ నిట్‌లో డీప్ లెర్నింగ్ అండ్ కంప్యూటర్ విజన్ అనే అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. డీఆర్‌డీఓ ఈసీఐఎల్, బీఈఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొనే స్థాయికి ఈసీఈ విద్యార్థులు ఎదగాలన్నారు. బీటెక్‌లో ఎనిమిది కంటే ఎక్కువ గ్రేడ్ పాయింట్లను తెచ్చుకుంటే ఐఐటీ తిరుపతిలో ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈసీఈ అసోసియేషన్ 07ను ప్రారంభించారు. డీన్‌లు ఆచార్యులు రామకృష్ణను ఘనంగా సత్కరించారు. డీన్‌లు టి.కురుమయ్య, జీబీ వీరేష్‌కుమార్, ఎస్ యువరాజు, పులి కిషోర్ ఆచార్యులు జి.కిరణ్‌కుమార్, కృష్ణ చైతన్య, నర్సింహారావు, వి.సందీప్, విష్ణువర్ధన్, వికాస్ రెడ్డి అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



నిట్‌లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ

ఏపీసీపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

- పోస్టులు లేకుండా లైన్‌మెన్ల బదిలీలు
- మంత్రి సిఫార్సు వల్లే అంటూ ప్రచారం

నూజివీడు: ఉద్యోగం ఇవ్వాలన్నా, బదిలీ చేయాలన్నా పోస్టు మంజూరై ఉండాలి. పోస్టు లేకుండా ఈ రెండింటిలో ఏదీ చేయడానికి కుదరదు. అయితే ఏపీసీపీడీసీఎల్‌లో అదేమీ అక్కర్లేదు. పోస్టు లేనిచోట్లకు ఇద్దరిని బదిలీ చేసేశారు. ఇదేంటని తోటి ఉద్యోగులు అడుగుతుంటే మంత్రి సిఫార్సు లేఖల మహత్యం అంటూ ప్రచారం నడుస్తోంది. ఏపీసీపీడీసీఎల్ నూజివీడు డివిజన్‌లో ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఏపీసీపీడీసీఎల్ నూజివీడు డివిజన్‌లో ఇటీవల ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అయితే నూజివీడు పట్టణంలో ఉన్న 4 పోస్టుల్లో నలుగురు లైన్‌మెన్‌లు పనిచేస్తున్నారు. ఇక్కడ లైన్‌మెన్ పోస్టులు ఖాళీ లేకపోయినప్పటికీ ఇద్దరిని పట్టణానికి బదిలీ చేయడంపై విద్యుత్‌శాఖలో తీవ్ర ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు లైన్‌మెన్‌గా పనిచేస్తున్న షేక్ మాబూ సుభాని, ఆగిరిపల్లి మండలం నర్సింగపాలెం లైన్‌మెన్‌గా పనిచేస్తున్న బి.రంగారావును నూజివీడుకు లైన్‌మెన్‌లుగా బదిలీచేశారు. మంత్రి సిఫార్సు లేఖలుండటం, వీరిద్దరిలో ఒకరు 1104 యూనియన్‌లో, మరొకరు 327 యూనియన్‌లో నాయకులుగా ఉండటం వల్లే నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ అడ్డగోలుగా బదిలీ చేయడం గమనర్హం. ఇంకో విచిత్రమేమిటంటే ముక్కొల్లుపాడు నుంచి లైన్‌మెన్‌ను బదిలీ చేసి ఆ స్థానంలో మాత్రం జూనియర్ లైన్‌మెన్‌ను నియమించడం కొసమెరుపు. పోస్టులు లేకుండా బదిలీ చేయడం వల్ల వీరికి జీతాలు ఎలా ఇస్తారనే ప్రశ్నలు సైతం ఎదురవుతున్నాయి. ఈ బదిలీలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నూజివీడులోని ఏపీసీపీడీసీఎల్ ఈఈ కార్యాలయం

చోరీ కేసులో కవలల అరెస్టు

రూ.5 లక్షల విలువైన బంగారం స్వాధీనం

ఏలూరు (టూటౌన్) : చోరీ కేసులో కవల సోదరులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5 లక్షలు విలువైన 60 గ్రాముల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ తన కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు నెలలో కృష్ణాష్టమి రోజున రాత్రి 7 గంటల సమయంలో ఒక మహిళ మెడలో బంగారు చైనును లాక్కొని పోయిన కేసులో ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామానికి చెందిన సైదు రాఘవేంద్ర ప్రసాద్ (27), సైదు రవీంద్రప్రసాద్ (27)లను అరెస్టు చేశామన్నారు. వీరు ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, కై కలూరు పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మహిళల మెడల్లో గొలుసులను దొంగతనాలకు పాల్పడినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన ఏలూరు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, నిడమర్రు ఇన్‌స్పెక్టర్ ఎం సుభాష్, ఎస్సై మదీనా బాషా, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

అంబేడ్కర్ విగ్రహం వేలు ధ్వంసం

జంగారెడ్డిగూడెం: అంబేడ్కర్ విగ్రహం వేలు ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా చట్టప్రకారం శిక్షిస్తామని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు గురువారం రాత్రి ధ్వంసమైంది. దీంతో దళిత సంఘాలు శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. మరోసారి ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఈ ప్రాంతంలో సీసీ కెమేరా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు అలుగు ఆనందశేఖర్, వెంప ఐజీ, కాటం డేవిడ్, మానుకొండ కిషోర్, పంతగాని వెంకన్న, గంజి వినోద్‌కుమార్, మానుకొండ మనోజ్, తొర్లపాటి శ్రీను, పాడపాటి రమేష్, గుండె నారాయణ అభి, ఏసుపాదం పాల్గొన్నారు.

'సుప్రీం'లో బాబుకు మళ్లీ షాక్

- సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- స్వార్థ రాజకీయాల కోసమే దుష్ప్రచారం
- లడ్డూ ప్రసాద వ్యవహారంలో భక్తుల్లో అయోమయం
- బాబు సిట్ ఇంటికి.. స్వతంత్ర సిట్ దర్యాప్తుకి


తిరుమల లడ్డూ దుష్ప్రచారంపై నిరసనగా ఇటీవల గూడెం బస్టాండ్ వద్ద వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ (ఫైల్)

పెంటపాడు: తిరుమల లడ్డూ ప్రసాదంపై ఏపీ సీఎం చంద్రబాబుకు సుప్రీం కోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తిరుమల లడ్డూ వివాదంపై దాఖలైన పిటిషన్లు విచారించిన సుప్రీం కోర్టు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసింది. సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించేందుకు తిరుమలలో లడ్డూ తయారీని తన స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని హిందూ సంఘాలతోపాటు ఇతర మతస్థులు సైతం వాదిస్తున్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కూటమి నేతలు మాట్లాడుతుండడం ఎంత వరకు సబబంటూ ప్రజానీకం, భక్తులు ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. అసలు ఎటువంటి కల్తీ నెయ్యి శ్రీవారి లడ్డు ప్రసాదానికి ఉపయోగించలేదని, టీటీడీ అధికారులు చెబుతున్నప్పటికీ కూటమి నేతలు భక్తులను తప్పుదారి పట్టించే విధంగా మాట్లాడుతున్నారని భక్తులు సైతం తలలుపట్టుకుంటున్నారు.

100 రోజుల అసమర్థపాలన డైవర్షన్ కోసమేనా

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా ఇప్పటివరకు పింఛన్లు పెంపు పంపిణీ తప్ప మరేఇతర సంక్షేమాన్ని అమలుచేయకపోవడం, సూపర్ సిక్స్ ఊసే లేకపోవడం వంటి విషయాలపై ఇప్పటికే ప్రజలు నిలదీస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అంతే కాకుండా తల్లికి వందనం పథకాన్ని విపరీతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో నీకు 15వేలు, నీకు 18వేలు అంటూ ఇంటింటికీ బాకా ఊదరగొట్టినా అవేమీ అమలు చేయపోవడంతో వీటన్నిటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే శ్రీవెంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదాన్ని వివాదం చేశారంటూ భక్తులు దుమ్మెత్తిపోస్తున్నారు. శ్రీవారి లడ్డు ప్రసాదంపై అభాండాలు మోపి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఇటువంటి రాజకీయాలు చేసే వారిని ఆ వేంకటేశ్వర స్వామి తగిన శిక్ష వేస్తారంటూ ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి



తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. రాజకీయం కోసం శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీయడం ప్రతి హిందూ మనస్సు తట్టుకోలేకపోతోంది. సుప్రీం కోర్టు వ్యాఖ్యలు ప్రతి హిందువుని ఆలోచనలో పడేసాయి. ఈ వ్యవహారంపై పూర్తిగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలి. స్వార్థ రాజకీయం కోసం భగవంతుడిని వాడద్దు.

– దేవరశెట్టి రాంబాబు, రైతు కొండేపాడు

చంద్రబాబుకు తగిన శిక్ష తప్పదు



నిరాధార ఆరోపణలతో వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు మచ్చపడేలా చేశాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా దుర్మార్గపు ఆరోపణలు చేసినందుకు కలియుగ ప్రత్యక్ష దైవం తగిన శిక్ష వేస్తాడు. అత్యున్నత న్యాయస్థానం సైతం కల్తీ నెయ్యి వాడలేదని టీటీడీ చెబుతోందని, సెప్టెంబరు 18నాటి ముఖ్యమంత్రి ప్రకటనకు సంబంధించి ఏ ఆధారం లేదని అనడం మంచి పరిణామం. ఏమైతేనే భక్తులు, ప్రజలను మాత్రం అయోమయంలో పడేయడంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారు.

– పాలా గణపతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, పెంటపాడు మండలం

హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే...!


గంటి చిన సర్వేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: తిరుమల శ్రీవారి లడ్డూపై సాక్షాత్తు సీఎం చంద్రబాబు నాయుడు నిరాధారమైన ప్రకటనలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ద్వారకాతిరుమల ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు గంటి చినసర్వేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూపై అనుచిత వ్యాఖ్యలు చేసి అందరినీ గందరగోళానికి గురి చేశారన్నారు. సుప్రీం కోర్టు సైతం సీఎం ప్రకటనపై విచారం వ్యక్తం చేసిందన్నారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్‌పై ఇటువంటి బురదజల్లే కార్యక్రమానికి తెగబడ్డారన్నారు. ఆస్పత్రికి వెళితేనే సెకండ్ ఓపీనియన్ తీసుకుంటామని, అటువంటిది శ్రీవారి లడ్డూ విషయంలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం చంద్రబాబు రెండవ అభిప్రాయం తీసుకోకుండా నిరాధారమైన ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ఇదిలా ఉంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం రెండో ఆలోచన లేకుండా దీక్ష చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రజల్ని మరింత గందరగోళానికి గురి చేసిందన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఇంటిలోనే సనాతన ధర్మం లేదన్నారు. లడ్డూ ప్రసాదంపై కూలంకషమైన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

నాగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


తణుకులో పూజలందుకున్న నాగమ్మ తల్లి

తణుకు అర్బన్: దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తణుకు జాతీయ రహదారి సమీపంలోని చక్రసహిత నాగదుర్గాదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాలతో పాటు శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. నిమ్మకాయిలు, గాజులతో నాగమ్మ తల్లిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తణుకు నలుమూలల నుంచి భక్తులు, భవానీ మాలదారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీ వాసవిలో ఫ్రెషర్స్ డే వేడుకలు


శ్రీ వాసవిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీవాసవి జూనియర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. జూనియర్ విద్యార్థులను సీనియర్స్ ఘనంగా ఆహ్వానించారు. యాజమాన్యం మాట్లాడుతూ విద్యలోనే కాకుండా సంస్కారంలోను విద్యార్థులు ముందు వరసలో ఉండాలని, ఉన్నతంగా ఆలోచనలు చేయాలని, ఉన్నతంగా ఎదగాలని పలు అంశాలపై అవగాహన కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వాసవి ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ, కళాశాల చైర్మన్ ఎన్వీ రమణారావు, కరస్పాండెంట్ మండా బ్రహ్మాజీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వం విఫలం


భీమవరం డైలీమార్కెట్‌లో కూరగాయల ధరలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

భీమవరం: కూరగాయధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు విమర్శించారు. శుక్రవారం పార్టీ నాయకులు పట్టణంలోని డైలీ మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిశీలించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ అడ్డూ అదుపు లేకుండా రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశనంటుతుంటే ప్రజాజీవనం దుర్భరంగా మారిందని, 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదేళ్లు గడిచిపోతున్నా ధరలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు మామిడిశెట్టి లక్ష్మీపతి, వైవీ ఆనంద్, న్యూటన్, పాలా త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కెరీర్‌పై దృష్టి పెట్టాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ముఖ్యంగా విద్యార్థి కెరీర్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షైన్ కోచింగ్ భీమవరం సెంటర్‌చే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగం సాధించాలంటే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. ఈ కాంపిటేటివ్ ప్రపంచంలో ఒక్క పోస్టుకు వంద మంది పైనే పోటీ పడుతున్నారన్నారు. దానికి తగ్గట్టుగా ప్రతీ విద్యార్థి కృషి, పట్టుదలతో ముందుకు వెళ్తూ విజయం సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, ఐక్యూఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానసముపార్జన


పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు: తెలుగు సాహితీ , సాంస్కృతిక రంగాల్లో ఎందరో గొప్ప కవులు రచనలు సేకరించి ముద్రించి తెలుగు ప్రజలకు అందిస్తున్న విశాలాంధ్ర ప్రచురణాలయం కృషి శ్లాఘనీయమని శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం తణుకు పాలిటెక్నిక్ కళాశాల వద్ద విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన పుస్తకాలను విశాలాంధ్ర ప్రచురణాలయం అందజేయడం గొప్ప విషయమన్నారు. జ్ఞాన సముపార్జనకు పుస్తకపఠనం ప్రతిఒక్కరికీ అవసరమన్నారు. డీవీవీయస్ వర్మ మాట్లాడుతూ కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ లాంటి ఎందరో గొప్ప కవులు రాసిన రచనలు సేకరించి ముద్రించడం అభినందనీయమన్నారు. లాభాపేక్ష లేకుండా మంచి రచనలు సేకరించి ముద్రించి ప్రజలకందించడమే ధ్యేయంగా విశాలాంధ్ర పనిచేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ మారుతున్న సామాజిక కాలమాన పరిస్థితులు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు కనుగుణంగా ప్రజలకవసరమైన పుస్తకాలను ప్రజల్లో అభ్యుదయ భావాలను పెంపొందించే రచనలు తెలుగు పాఠక లోకానికి విశాలాంధ్ర ప్రచురణాలయం అందిస్తూ ఎనలేని కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రతినిధి సూరిశెట్టి రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు అట్రు వెంకట్రావు, దాకే మునలయ్య, సీపీఐ నాయకులు గార ప్రసాద్, నామాన వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, డివిఎన్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సువార్త స్వస్థత మహాసభలు

పెంటపాడు: ఈనెల 13 నుంచి గూడెం కడకట్ల ఓవర్ బ్రిడ్జి వద్ద సువార్త స్వస్థత మహాసభలు నిర్వహించనున్నట్లు గాడ్స్‌మినిస్ట్రీస్ అధ్యక్షుడు ఎం. ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు నిర్వహించబోయే ఈ సభలకు అంతర్జాతీయ ఉజ్జీవ ప్రసంగీకులు ఇవాంజలిస్ట్ ఎ. రవి అబ్రహాం హాజరవుతారన్నారు. ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళ అదృశ్యం, పోలీసుల కేసు నమోదు

తణుకు: ఉండ్రాజవరం గ్రామానికి చెందిన మహిళ తణుకు పట్టణంలో అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. అదృశ్యమైన మహిళ తణుకులోని వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఈనెల 2న యధావిధిగా ఆటోపై తణుకు వచ్చారు. అయితే పనికి వెళ్లకపోగా తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లేకపోడంతో భర్త వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలి

తణుకు టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి కార్మికుల ఉపాధి కల్పించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తణుకు మండలం వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేల్పూరు గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం, అనంతరం ర్యాలీగా పంచాయతీ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చేందుకు ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టాక పాలసీ ప్రకటించినా నేటికి క్షేత్రస్థాయిలో ఇసుక లేక నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. తక్షణం ఉచిత ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో కాకుండా పారదర్శకంగా సామాన్యులకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీని వలన భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అంబటి రామకృష్ణ, యూనియన్ అధ్యక్షుడు ఎర్ర మల్లికార్జునరావు, తిరునాథం వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, వాసా వెంకటేశ్వరరావు, వాడపల్లి శరవన్, గణేష్, యాతం పెద్దిరాజు, నాగేశ్వరరావు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామ కార్యదర్శి సుంకర రత్న మాలికకు వినతి పత్రాన్ని అందజేశారు.

6 నుంచి మీనవిల్లూరులో ఆశీర్వాద పండుగలు

పెంటపాడు: మండలం మీనవిల్లూరు జీసస్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో 46వ వార్షిక ఉపవాస ఆశీర్వాద పండుగలు ఈనెల 6 నుంచి నిర్వహించనున్నట్లు యుపీఏ అధ్యక్షుడు డీఆర్‌కే మోజస్ ఒక ప్రకటనలో తెలిపారు. పాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ సమావేశాలలో విజయవాడకు చెందిన వరల్డ్ ఫెయిత్‌మిషన్ అధ్యక్షుడు బిషప్ జి.రక్షణానందం, గూడెం యుపీఏ అధ్యక్షుడు జీజే జ్యోతి ఆనంద్, ముమ్మిడివరప్పాడుకు చెందిన మోజస్, ఆరేడుకు చెందిన పాలా ఆశీర్వాదంలు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా 6న ఉదయం 10 గంటలకు స్వస్థత శాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పరిసర గ్రామ భక్తులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగన్మాతా.. దీవించమ్మా..


అత్తిలి: ఆరవల్లిలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో శ్రీకనకదుర్గ అమ్మవారు


తాడేపల్లిగూడెం (టీటీసీ): బలుసులమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

అత్తిలి: మండలంలోని దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలోగల కనకదుర్గమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, సాయంత్రం కుంకుమార్చనలు చేసారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

తణుకు టౌన్: మండలంలోని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లను శుక్రవారం శ్రీ బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో శ్రీ యల్లారమ్మ వారి ఆలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మి అమ్మవారిగా అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, ఆలయ ఈవో పీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో రెండోరోజు మహాలక్ష్మి అమ్మవారిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణిగా బాలాత్రిపుర సుందరి దర్శనం


తాడేపల్లిగూడెం రూరల్: బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిస్తున్న బాలత్రిపురసుందరీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ విద్యా, ఆధ్యాత్మిక పీఠంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారు దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవావరణ పూర్వక శ్రీచక్రార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమం, ఏకాదశ రుద్రాభిషేకాలను పీఠం నిర్వాహకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ఈ నెల 9వ తేదిన మూలానక్షత్రం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా దేవి నవరాత్రి మహోత్సవాలు


తణుకు టౌన్: శ్రీ బాలత్రిపుర సుందరిదేవీ అలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు రెండోవ రోజు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలో బలుసులమ్మ ఆలయం వద్ద అమ్మవారిని శ్రీ కాశీ అన్నపూర్ణదేవిగా విశేష అలంకరణ గావించారు. శ్రీ మహాలక్ష్మి సౌభాగ్య సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షణలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వాసవి కన్యపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీగజలక్ష్మిదేవి అమ్మవారిగా విశేష అలంకరణ గావించారు. విశేష పూజలు నిర్వహించారు. శంకరమఠంలో సర్వమంగళమ్మ అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. శ్రీదేవి మహంకాళి అమ్మవారిని శ్రీ గాయత్రి దేవిగా అలంకరించారు. బ్రహ్మనందరెడ్డి మార్కెట్‌లో అమ్మవారిని శ్రీ గాయత్రిదేవిగా అలంకరించారు. మునిసిపల్ వర్కర్స్ రెల్లి కాలనీ కడకట్ల శ్రీ బాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా విశేష అలంకరణ గావించారు. శ్రీ విశ్వదుర్గేశ్వరీ సమేత అమ్మవారిని గౌరీ దేవి అమ్మవారిగా అలంకరించారు. వీకర్స్‌కాలనీ గాయిత్రి దేవి అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో లక్ష పుష్పార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

రెండో రోజు దసరా ఉత్సవాలు


పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని విశేష అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

పెంటపాడు: మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసారు. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని స్వయంభువుగా వెలసిన అమ్మవారిని ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మౌంజీపాడు కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కె. బుచ్చిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. కె. పెంటపాడు బైరాగిమఠంలో దుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠి, రామశర్మలు ప్రత్యేక పూజలు చేసారు. రావిపాడు గ్రామంలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసారు. భవానీ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచి సత్కారం అందుకున్న న్యాయవాదులు

భీమవరం: కోర్టుల్లో కేసులతో అలసటకు గురయ్యే న్యాయవాదులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ఆరోగ్యానిస్తాయని భీమవరం పోక్సో కోర్టు జడ్జి ఎం.సోమశేఖర్ అన్నారు. గత నెల 28, 29 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఏపీ స్టేట్ లెవెల్ అడ్వకేట్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం న్యాయవాదులు పమ్మి రాధా కిరణ్మయి, బోకూరి సునీత ఉమెన్స్ డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా నిలవగా మట్టా చంద్రశేఖర వంశీ, రాధా మిక్సిడ్ డబుల్స్ విభాగంలో రన్నర్స్‌గాను పోటీల్లో పాల్గొన్న తరుణ్ ప్రతిభ కనబర్చిన సందర్భంగా శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోక్సో కోర్టు ఆవరణలో నిర్వహించిన అభినందన సత్కార సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి అప్పలస్వామి, జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సురేష్ బాబు, జూనియర్ డివిజన్ రెండో అదనపు సివిల్ జడ్జి ధనరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలేటి న్యూటన్, అడపాల ప్రసన్నకుమార్, కోశాధికారి పరాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం

భీమవరం : కేంద్ర ప్రభుత్వ శాఖల్లో తపాలా శాఖ చాలా కీలకమైందని, పోస్టల్ శాఖలో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు ఎన్నో ఉన్నాయని భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీస్లో హెడ్ పోస్ట్ మాస్టర్ పాలమూరి రాజు అన్నారు. భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీస్లో శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ అధ్వర్యంలో ప్రపంచ తపాల శాఖ దినోత్సవ వేడుకల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్విట్జర్లాండ్ లోని బెర్న్‌లో 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) స్థాపనకు గుర్తుగా అక్టోబరు 9న స్థాపించిబడిందని, ఈ నేపథ్యంలో 9 నుంచి 16 వరకు వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు.